సాక్షి సంగారెడ్డి

సోమవారం ¦ 29 ¦ మే ¦ 2023



యాసంగి యాతన

యాసంగి సాగు రైతులకు యాతన మిగిల్చింది. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలని ఆందోళన బాట పట్టారు. 8లో..



ఒకరివెంట ఒకరు

కొల్చారం శివారులో జరిగిన ప్రమాదంలో గాయపడిన భార్యాభర్తలు చికిత్స పొందుతూ శనివారం ఒకరు, ఆదివారం మరొకరు మృతిచెందారు. 8లో..

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నలుగురు కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు చేయలేదన్నారు.

న్యూస్‌రీల్

ముగిసిన ఫీల్డ్ విజిట్



వర్క్‌షాపులో విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: స్టార్టప్‌లు, వర్ధమాన పారిశ్రామికవేత్తలను సన్నద్ధం చేసే లక్ష్యంతో గీతం హైదరాబాద్‌లోని వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (వీడీసీ) నిర్వహిస్తున్న సమ్మర్ స్టార్టప్ స్కూల్‌లో భాగంగా డిజైన్ థింకింగ్ వర్క్‌షాపు, వెంచర్ ఫారెస్ట్ ట్రయల్స్ క్షేత్ర స్థాయి పర్యటన ఆదివారం విజయవంతంగా ముగిశాయి. సమస్య–పరిష్కార నైపుణ్యాలు, ఆవిష్కరణ వ్యూహాలతో కూడిన ఈ వర్క్‌షాపును వీడీసీ సీనియర్ వెంచర్ కోచ్‌లు వాసుదేవ్, రాపేటి నిర్వహించారు. క్షేత్ర పర్యటనను వారు పర్యవేక్షించారు. వ్యాపారం విజయవంతం కావాలంటే వినియోగదారుల అవసరాలపై లోతైన అవగాహనను ఏర్పరచుకోవడం, సృజనాత్మకంగా యోచించడం వంటి మెళకువలను వివరించారు. ఈ ప్రపంచ సంక్షోభానికి వినూత్న పరిష్కారాలను రూపొందించడానికి ×జీవవైవిధ్య నష్టం¤ అనే ఇతివృత్తంతో సమస్య–పరిష్కారానికి మానవ–కేంద్రీకృత విధానంపై ఈ కార్యశాల దృష్టి సారించడంతో పాటు స్టార్టప్ల విజయంలో దానిపాత్రను వివరించారు. సవాళ్లను సరికొత్త దృక్పథంతో ఎదుర్కోవడానికి, ఆవిష్కరణలు చేయడానికి, వినియోగదారులకు అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తులు, సేవలు అందించడానికి ఈ కార్యక్రమంలో చేసిన మార్గదర్శనం తమకు ఎంతో తోడ్పడుతుందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. అలాగే క్షేత్ర పర్యటన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

కొండాపూర్(సంగారెడ్డి): ధాన్యం కొనుగోలు కేంద్రాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి వడ్లు కొనకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కేంద్రాలకు లారీలు రాకపోవడంతో వందల సంఖ్యలో ట్రాక్టర్లు లైన్లలో ఉంటున్నాయని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు రాకపోవడంతో రోజుకు రూ.2 వేల చొప్పున అదనంగా ట్రాక్టర్ కిరాయి కడుతున్నారని, రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతుందన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన తర్వాత జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాలలో ఐదు నుంచి పది రోజుల చొప్పున పడిగాపులు కాస్తున్నారని, సంబంధిత అధికారులు , జిల్లా మంత్రులు స్పందించడం లేదన్నారు. వెంటనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి హరీశ్ రావు, కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యం నర్సింలు, నాయకులు కృష్ణ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు



సంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాల

జహీరాబాద్: జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామంలోగల శ్రీ సంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. ఈ సర్టిఫికెట్ మూడు సంవత్సరాల వరకు చెల్లుబాటులో ఉంటుందని ప్రిన్సిపాల్ డి.కుమారస్వామి తెలిపారు. ఇటీవల ఎన్‌బీఏ బృందం కళాశాలను సందర్శించి నాణ్యతా ప్రమాణాలు, సాంకేతిక, మౌలిక సదుపాయాలపై అధ్యయనం చేసింది. ఎన్‌బీఏ గుర్తింపుతో విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీల్లో అవకాశాలు లభిస్తాయని ప్రిన్సిపాల్ తెలిపారు. గుర్తింపు లభించడంతో హర్షం వ్యక్తం చేశారు. ఇందు కోసం కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అంగరంగ వైభవంగా నిర్వహించాలి

గడపగడపకు దశాబ్ది ఉత్సవాలు
- వేడుకలపై మంత్రి హరీశ్‌రావు దిశానిర్దేశం
- హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు

మెదక్‌జోన్: రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. ఆదివారం మెదక్ కలెక్టరేట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా చక్కటి కార్యాచరణతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్రం ఏర్పడి జూన్ 2 నాటికి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని పదో వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రభుత్వం 21 రోజుల పాటు రోజుకో కార్యక్రమం నిర్వహించేలా షెడ్యూల్ ప్రకటించిందన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని నేడు దేశం గర్వించదగ్గ స్థాయిలో అన్ని రంగాల్లో పురోగమించామని తెలిపారు. రైతు వేదికల వద్ద ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రైతులతో కలిసి భోజనం చేయాలని సూచించారు. సంక్షేమ పథకాలతో కూడిన ఫ్లెక్సీలను గ్రామాల్లో ఏర్పాటు చేయాలన్నారు. మిషన్ కాకతీయ ద్వారా సాగునీటి చెరువుల పునరుద్ధరణ, గ్రామాల్లో చెక్ డ్యాంలు, ఊట చెరువుల నిర్మాణంతో భూగర్భజలాలు పెరిగాయని తెలిపారు. రాష్ట్రం వస్తే చీకటి అవుతుందని చెప్పిన చోట నేడు విద్యుత్ వెలుగులు చిమ్ముతూ 9 ఏళ్లలో ప్రగతి సాధించామన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కింద మంజూరైన పనుల వివరాలతో పాటు అన్ని రకాల అభివృద్ధి నిధుల వివరాలు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. ఆధునికతతో ఉపాధి కోల్పోయిన కులవృత్తులకు అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించి రూ. లక్ష ఇవ్వనుందని తెలిపారు. అదేవిధంగా అర్హులైన గిరిజనులకు పోడు భూముల హక్కు పత్రాలు అందజేస్తామన్నారు. అర్హత గల వారికి ఇంటి స్థలాల పట్టాలు అందజేయాలని పేర్కొన్నారు. జూన్ 24 నుంచి 30 వరకు అర్హులైన గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేయాలని.. జూలై మొదటివారంలో దళితబంధు యూనిట్లు గ్రౌండింగ్, ప్రతి నియోజకవర్గంలో సొంత జాగా ఉన్న 3 వేల మందికి ఆర్థిక సాయం అందించనున్నట్లు చెప్పారు. కొత్త సభ్యత్వాలు తీసుకున్న మత్స్యకారులకు గుర్తింపు కార్డులు అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించి అసైన్డ్ ల్యాండ్ వారసత్వ మార్పు చేసి అర్హత పొందేవిధంగా చూడాలన్నారు. పట్టాలు ఇచ్చి పొజిషన్ చూపని వాటిని గుర్తించి లేఅవుట్ చేసి నంబరింగ్ ఇవ్వాలన్నారు. మన ఊరు–మనబడి పనులు మరింత వేగవంతం చేసి విద్యా దినోత్సవం రోజు ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో మెదక్, సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్మన్లు హేమలత శేఖర్‌గౌడ్, రోజాశర్మ, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింత ప్రభాకర్, మెదక్, సిద్దిపేట జిల్లా కలెక్టర్లు రాజర్షిషా, ప్రశాంత్ జీవన్‌పాటిల్, సంగారెడ్డి అదనపు కలెక్టర్ వీరారెడ్డి, సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత, సంగారెడ్డి ఎస్పీ రమణకుమార్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు సైదులు, యాదవరెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, యాదవరెడ్డి, ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, మాణిక్‌రావు, క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, గడా ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

70 శాతం మేర కొనుగోళ్లు పూర్తి

జిల్లాలో 70 శాతం మేర ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని.. ఇప్పటివరకు 2 కోట్ల 20 లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని తెలిపారు. పౌర సరఫరాల సంస్థ చైర్మన్, కమిషనర్‌ను జిల్లాకు పంపి మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి కొనుగోళ్లు మరింత వేగవంతంగా జరిగేలా ఆదేశాలిస్తామని పేర్కొన్నారు.

పేదల సంక్షేమం, అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నాగల్‌గిద్ద మండలం ఔదత్‌పూర్‌కు చెందిన ఎనిమిది మంది ఇళ్లు లేని నిరుపేదలకు తన చేతులమీదుగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఔదత్ పూర్‌కు చెందిన వార్డు సభ్యులు అనిల్‌తోపాటు దాదాపు వంది మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సిర్గాపూర్ మండలం జెమ్లా తండాలో ఎస్టీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని తండావాసులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంజూరు పత్రాన్ని అందజేశారు.



ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయండి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను జయప్రదం చేయండి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కిర్బి యూనియన్ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. ఆదివారం మండలంలోని పాశమైలారంలో జరిగిన కిర్బి కార్మికుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ ఏర్పడిన తర్వాతనే దేశంలో ఐక్య పోరాటాలు వచ్చాయని, కార్మికులు ఏకమయ్యారని గుర్తు చేశారు. పాలకులు తెచ్చే కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా పోరాడుతున్న ఏకైక సంఘం సీఐటీయూ అన్నారు. ఐక్యత, పోరాటం నినాదంతో సీఐటీయూ ఏర్పడిందన్నారు. దేశం కోసం, ప్రజల కోసం, నిరుద్యోగుల కోసం, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా, విచ్ఛిన్నకర ఉద్యమాలకు వ్యతిరేకంగా సీఐటీయూ పోరాడిందని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, ప్రైవేటు విధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాడిన సంఘం సీఐటీయూ అన్నారు. రెండో లేబర్ కమిషన్ సిఫార్సులు, ప్రస్తుత మోడీ తెచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సీఐటీయూ పోరాడిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం సీఐటీయూతోనే సాధ్యమన్నారు. ఈనెల 30వ తేదీన జరిగే సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బోరంచకు పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న బోరంచ నల్లపోచమ్మ ఆలయం

మనూరు(నారాయణఖేడ్): జిల్లాలో ప్రసిద్ధి చెందిన బోరంచ నల్లపోచమ్మ ఏడు వారాల జాతర జరుగుతోంది. ఐదో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. దాదాపుగా పది వేల మందికి పై భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి దర్శన ఏర్పాట్లుచేసినట్లు పేర్కొన్నారు. భక్తులు అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లిలో భక్తుల రద్దీ



క్యూలో వేచిఉన్న భక్తులు

కొముర వెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకోవడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. సుమారు 12 వేల మంది స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. శనివారం సాయంత్రం నుంచి క్షేత్రానికి చేరుకున్న భక్తులు ఆలయ వసతి, ప్రైవేట్ వసతి గదుల్లో బస చేశారు. ఆదివారం ఉదయం స్వామి వారి పుష్కరిణిలో స్నానమాచరించారు. అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, గంగరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణంలో పాల్గొన్నారు. కొండపైన రేణుక ఎల్లమ్మను దర్శించుకొని బోనం చెల్లించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఆలయ ఈఓ బాలాజీ శర్మ, ఏఈఓలు అంజయ్య, శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పీసీబీ అధికారుల తనిఖీలు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమల నుంచి వ్యర్థాల ఘాటు వాసన రావటంతో శనివారం రాత్రి స్థానికులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పీసీబీ టాస్క్‌ఫోర్స్ అధికారి వెంకటేశ్ తదితరులు పారిశ్రామిక వాడలో పర్యటించి వాయు కాలుష్య నమోదు మిషన్‌లను పరిశీలించారు. వ్యర్థాలను వదిలే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించరు.

దరఖాస్తుల స్వీకరణ

మునిపల్లి(అందోల్): మహిళా డిగ్రీ కళాశాలలో చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు బుదేరా మహిళా డిగ్రీ (గురుకుల) రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆరిఫా తెహసీన్ ఆదివారం తెలిపారు. పదో తరగతి మెమో, ఇంటర్ హాల్ టికెట్, కుల, ఆదాయం, 2023 బోనఫైడ్, టీసీ ఆధార్ కార్డు, ఒరిజినల్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లో ఏర్పాటు చేసిన మేరీ లైఫ్ మేరి స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా మాక్స్‌సొసైటీ కాలనీ అంబేద్కర్ విగ్రహం నుంచి ఎల్‌ఐజీ బస్టాండ్ వరకు వన్ కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణంపై ప్రతీ ఒక్కరికి అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం అనే కార్యక్రమాలను చేపడుతోందన్నారు. పర్యావరణం పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన రీసైకిల్, రెడ్యూస్, రీయూజ్ కేంద్రలకు ప్ర జలు స్వచ్ఛందంగా పాత వస్తువులను ఇ వ్వాలని కోరారు. జూన్ 5వ తేదీన పర్యావరణ దినోత్సవం సందర్భంగా డివిజన్ పరిధిలో పూరిస్థాయిలో ప్లాస్టిక్‌ని అరికట్టాలని, పర్యావరణాన్ని కాపాడాలని కాలనీ వాసులతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆదర్శ్ రెడ్డి, రాణి యాదవ్, ఐలేష్ యదవ్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా వ్యర్థాల పారబోత

- పట్టించుకోని పీసీబీ అధికారులు
- రోడ్లపై పారుతున్న కలుషిత జలాలు
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



గడ్డపోతారంలో పారబోసిన వ్యర్థ జలాలు (ఫైల్)



బొల్లారంలో పడేసిన ఘన వ్యర్థాల సంచులు

జిన్నార(పటాన్‌చెరు): వేసవిలోనూ కలుషిత జలాలు ఏరులా పారుతున్నాయి. వీటితో నిండిన కుంటలు నిండాయి. వ్యర్థ జలాలు, వ్యర్థాలను పారబోస్తున్నారు. దీంతో ఆ పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయి. తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. రాకపోకలు సాగించేవారు నానా అవస్థలుపడుతున్నారు.

- జిన్నారం మండలంలోని గడ్డపోతారం, ఖాజీపల్లి, బొల్లారం పారిశ్రామిక వాడల్లో వేసవిలో కలుషిత జలాలు ఏరులై పారుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థ జలాలను రాత్రి వేళలో ట్యాంకర్లతో తీసుకువచ్చి రోడ్లపై పారబోస్తున్నారు. దీనికి తోడు వ్యర్థ రసాయనాల సంచులు పారబోస్తున్నారు.
- ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా సంబంధిత కాలుష్య నియంత్ర బోర్డు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పారిశ్రామిక వాడల్లోని కుంటలు, చెరువులు పూర్తిగా కలుషితమయ్యాయి. ఈ నీటిని తాగిన పశువులు మృత్యువాత పడుతున్నాయి.

కొరవడిన నిఘా

- పారిశ్రామిక వాడల్లో వ్యర్థ జలాల ప్రవాహం జరుగుతున్నా పీసీబీ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. తగిన నిఘా లేకపోవటంతో పరిశ్రమల యాజమాన్యాలు ఇష్టారీతిన కలుషిత జలాలను కుంటల్లో వదిలేస్తున్నారు.
- దీంతో పాటు ట్యాంకర్ల ద్వారా గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థ జలాలను తీసుకువచ్చి రోడ్లపై పారబోస్తున్నారు. ఈ విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కాలుష్యంగా మారుతున్న కుంటలు, చెరువులు

- పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలు బయటకు వస్తుండటంతో సమీపంలోని చెరువులు, కుంటలు కలుషితమవుతున్నాయి. దీంతో ఈ నీరు వ్యవసాయానికి పనికిరాకుండా పోతోంది.
- ఇటీవల మూడు సార్లు గుర్తుతెలియని వ్యక్తులు గడ్డపోతారం పారిశ్రామిక వాడల్లోని రోడ్లపై వ్యర్థ జలాలను పారబోశారు. స్థానిక రాజకీయ నాయకులు అండదండలతోనే పరిశ్రమల యాజమాన్యాలు బహిరంగంగా జలాలను వదలుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఘాటు వాసన

- కలుషిత జలాల సమస్య ఉండగా, మరో వైపు వాయు కాలుష్య సమస్య తీవ్రంగా ఉంది. వ్యర్థాల ఘాటు వాసనలు వెలువడుతున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు పీసీబీ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించటం లేదని స్థానికులు చెబుతున్నారు.
- ఘాటు వాసనల గాఢత తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన యంత్రాలు సరిగా పనిచేయటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై అధికారులు తగిన చర్యలు చేపట్టి, ఘాటు వాసనలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూటగట్టి పడేస్తున్నారు

- వ్యర్థ ఘన పదార్థాలను కూడా కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు సంచుల్లో మూటలు కట్టి పారబోస్తున్నారు. ఇటీవల బొల్లారం పారిశ్రామిక వాడలో కొంతమంది వంద సంచులను పడేస్తూ వెళ్లారు. ఈ విషయంపై విచారణ జరుపుతున్నామని పీసీబీ అధికారులు చెబుతున్నారు.

ఏం చేయాలి?

- రసాయన వ్యర్థ జలాలు, ఘన పదార్థాలను పారబోయకుండా ట్రీట్‌మెంట్ ప్లాంటులకు తరలించాలి. వీటిని ఈ ప్లాంట్‌కు పంపటం వల్ల యాజమాన్యాలకు ఖర్చు ఎక్కువవుతుంది. ఈ ఖర్చును తగ్గించుకునేందుకు యాజమాన్యాలు నిబంధనలను సైతం లెక్క చేయటం లేదు.
- అనుమతులు లేని కొత్త రసాయన ఉత్పత్తులు చేస్తుండటంతో వెలువడుతున్న కాలుష్య జలాల లెక్కను తప్పించుకునేందుకు యాజమాన్యాలు ఇలాంటి అడ్డదారులు వెతుక్కుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- ఇప్పటికైన ఇలాంటి ఘటనలు జరగకుండా పీసీబీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పారిశ్రామిక వాడల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

కలుషిత జలాలు, వ్యర్థ పదార్థాల పారబోత, ఘాటు వాసనలు వెలువడటంపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నాం. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు మా దృష్టికి తీసుకురావాలి. తగినంత సిబ్బంది లేకపోవటంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వ్యర్థ జలాలు, వాయువులు, ఘన పదార్థాలు పారబోసిన పరిశ్రమలను గుర్తించి వారికి నోటీసులు కూడా ఇస్తున్నాం.

– కుమార్‌పాఠక్, పీసీబీ ఈఈ

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



గేదె కళేబరం వద్ద భూపాల్

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాత పడిన సంఘటన మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు భూపాల్ వ్యవసాయ సాగుతో పాటు పాడిగేదెలతో జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం ఎప్పటిలాగే గేదెలను మేత కోసం పొలాల వద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్‌వైర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ 35 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

పర్మిట్ రూంలో చోరీ

రామాయంపేట(మెదక్): పట్టణంలోని మెదక్ రోడ్డులో ఉన్న వైన్‌షాప్ పర్మిట్ రూంలో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గది తాళాలు పగులగొట్టిన దుండగులు అందులో ఉన్న రూ.7800 నగదును దోచుకెళ్లారు. వైన్‌షాప్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు.

స్కేటింగ్‌లో విద్యార్థి ప్రతిభ



శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన విద్యార్థి పిట్ల ధనుశ్ రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో ప్రథమ బహుమతి సాధించాడు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమ్మర్ కప్ చాంపియన్‌షిప్‌లో 12 సంవత్సరాల స్కేటింగ్ విభాగంలో పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతితో పాటు గోల్డ్‌మెడల్ సాధించాడు.

వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: నిద్రించిన చోటే ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగోడ్ మండలం తిమ్మపూర్ గ్రామానికి చెందిన సాయిలు, అతడి సోదరుడు నర్సింహులు(35) బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడలో ఉంటున్నారు. ఆదివారం ఉదయం నర్సింహులు రోజు మాదిరిగానే పాలు తెచ్చుకొని తాగాడు. తాగిన కొద్ది సేపటికే వాంతులు కావడంతో నిద్రించాడు. నిద్రించిన చోటే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

సిద్దిపేటఅర్బన్: అనుమతి లేకుండా వ్యానులో పశువులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పట్టణ శివారులో మిలాన్ గార్డెన్ రోడ్డు వద్ద శ్రీకృష్ణ వెంచర్‌లో ఆదివారం సాయంత్రం ఓ వ్యానులో పశువులు తరలిస్తున్నట్లు డయల్ 100కు ఫోన్ వచ్చిందన్నారు. అప్రమత్తమైన బ్లూకోట్స్ సిబ్బంది రమేష్, కిషన్ వ్యానును పరిశీలించగా 20 ఎద్దులు, రెండు ఆవులు ఉన్నాయన్నారు. డ్రైవర్ ఎండీ షఫీని అదుపులోకి తీసుకొని విచారించగా వరంగల్ జిల్లా పరకాల నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్టు తెలిపాడు. పశువులను కొండపాక శ్రీరామదాసు గోశాలకు తరలించి, కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

యాసంగి యాతన

ఆరుగాలం అన్నదాతలకు కష్టాలే

సాక్షి, సంగారెడ్డి డెస్క్:

వడగండ్లు... కడగండ్లు మిగిల్చే..
రెక్కల కష్టం.. కన్నీటి పాలయ్యే...
అకాల వర్షాలు ఆగమాగంజేసే..
అన్నిరకాల రందీని రైతు తట్టుకున్నా..
కొనుగోలు కేంద్రంలో మళ్లీ కష్టాలు మొదలయ్యే...
వరికుప్పలు.. కాంటాల దాకా చేరక
తరుగంటూ తూకంలో దోచుకున్నా...
కాంటాలు అయినా.. లారీలు రాక...
మధ్యమధ్యలో చిటపట చినుకులు...
ధాన్యం కుప్పలు.. బస్తాలు తడిచే..
రైసుమిల్లులు కొర్రీ పెట్టే..
ఏటికేతంబట్టి ఎయిపుట్లు పండించినా...
ఎన్నడూ మెతుకెరుగరన్నా..

అన్నట్టు ఈ యాసంగి సాగు రైతులకు యాతన మిగిల్చింది. రైతులు రోడ్డెక్కారు..ధర్నాలు చేశారు..రాస్తారోకోలు చేశారు....ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టారు. ఇదేదో మద్దతు ధర కోసం కాదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రతిరోజూ ఎదురవుతున్న కష్టాలు తట్టుకోలేక రైతులు ఆందోళన బాట పట్టారు.



వడగండ్లు.. ఆపై అడపాదడపా వర్షాలు



వరికోత దశకు చేరేసరికి వడగండ్ల వాన రైతులను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఈ ఏడాది మార్చి 18వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు అడపాదడపా వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. రెండుసార్లు వడగండ్ల వానతో పలుచోట్ల వడ్లు నేల రాలాయి. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. కోతల తర్వాత కొనుగోలు కేంద్రాలకు వచ్చాక కూడా వానలు రైతులను వదల్లేదు. కాంటాలు కాక కొన్నిచోట్ల వడ్లు తడవగా, మరికొన్ని చోట్ల కాంటా అయిన బస్తాలు కూడా తడిశాయి. దీంతో మిల్లర్ల కొర్రీలతో రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

కాంటా చూడకుండానే కానరానిలోకాలకు



నర్సాపూర్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన బుసగల్ల శ్రీనివాస్ 20 బస్తాల ధాన్యాన్ని నర్సాపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రానికి ఈనెల 19వ తేదీన తీసుకొచ్చాడు. కాంటాకు మూడునాలుగురోజులు పడుతుందని సెంటర్ నిర్వాహకులు చెప్పారు. ఇప్పట్లో కాంటా అయ్యే పరిస్థితి లేదని భావించిన శ్రీనివాస్ తన మిత్రుడు కృష్ణతో కలిసి ఓ రైసుమిల్లులో ధాన్యం అమ్మేందుకు మాట్లాడదామని బైక్‌పై ఈ నెల25వ తేదీన బయలుదేరాడు. ఆటో ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. కృష్ణకు గాయాలయ్యాయి.



లారీలు రావడం లేదని ఆత్మహత్యాయత్నం

శివ్వంపేట మండల కేంద్రానికి చెందిన రైతు రవితేజ స్థానికంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ఇరవై రోజుల క్రితం ధాన్యం తీసుకొచ్చాడు. ఆరు రోజుల క్రితం కాంటాలు అయ్యాయి. లారీలు లేక సెంటర్ నుంచి ధాన్యం తరలింపు జరగలేదు. వాతావరణంలో మార్పులతో ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితితో ఆందోళన చెందాడు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని భావించిన రవితేజ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో హుటాహుటిన అధికారులు ధాన్యాన్ని తరలించారు.

తరుగు పేరిట అధిక తూకం

వాస్తవానికి పీఏసీఎస్, ఐకేపీ కొనుగోలు సెంటర్లలో ధాన్యం బస్తాకు 40కేజీల 600 గ్రాముల తూకం వేయాలి. తాలు ఉందని, బస్తాకు 42 కేజీల ధాన్యం తూకం వేస్తున్నారు. కొన్ని సెంటర్లలో అయితే 44 కేజీలకు వరకు కాంటా వేసిన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటివరకు ఎక్కడా తూకంలో తేడాలపై అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.





ఐదెకరాలు కోస్తే.. ట్రాక్టర్ లోడు వడ్లు రాలే

ఐదెకరాల్లో వరి నాటేస్తే రూ 1.30 లక్షల పెట్టుబడి అయ్యింది. తీరా పంట చేతికందే సమయంలో దెబ్బమీదదెబ్బలా రెండుసార్లు వడగండ్ల వాన పడింది. పంట 90 శాతం నాశనమైంది. మిగిలిన పంటను కోస్తే ఆరుగంటల సమయం అయ్యింది. తీరా ట్రాక్టర్ లోడు వడ్లు కూడా పండలేదు. వడగండ్ల వాన పడ్డప్పుడు అగ్రికల్చర్ ఆఫీసర్లు వచ్చి చూసింద్రు. మొత్తం రాలిపోయాయని రాసుకుంద్రు. ఇప్పటివరకు నయాపైసా కూడా రాలే. పెట్టిన పెట్టుబడి కూడా మీద పడింది. ఏం చేయాలో తోస్తలేదు. ఇది నా ఒక్కడి పరిస్థితే కాదు అందరు రైతులు గిట్లనే ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే కష్టమే.

– లక్కిరెడ్డి రాజిరెడ్డి, దుబ్బాక

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఉమ్మడి మెదక్ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా.. ఆరుగురికి గాయాలు అయ్యాయి.

హుగ్గెల్లిలో యువకుడు..

జహీరాబాద్: జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్ గ్రామానికి చెందిన సాల్మన్ తన స్నేహితులు వినోద్, దేవిదాస్‌తో కలిసి శనివారం అర్ధరాత్రి మోటారు సైకిల్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సాల్మన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వినోద్, దేవిదాస్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా సాల్మన్ జహీరాబాద్‌లో అడ్డా కూలీగా పని చేస్తున్నాడు. పని ముగించుకున్న అనంతరం మోటారు సైకిల్‌పై 65వ జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని ..

మెదక్ మున్సిపాలిటీ: టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మెదక్ పట్టణ శివారులోని బంగ్లా చెరువు ప్రాంతంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్తభూపతిపూర్ గ్రామానికి చెందిన కామిని పోచయ్య(65) తన లూనాపై వెళ్తుండగా టిప్పర్ ఢీకొట్టింది. దీంతో కామిని పోచయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



కామిని పోచయ్య మృతదేహం

కారు బైక్ ఢీ..

కొడిపల్లి(నర్సాపూర్): కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొడిపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని కూకుట్లపల్లి గ్రామానికి చెందిన పెద్ద బట్టయ్య, లింగారావు దేవులపల్లి వైపు నుంచి కొడిపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో 765డీ జాతీయ రహదారి దాటే క్రమంలో హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు, బైక్ ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న బట్టయ్య, లింగారావుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన బట్టయ్య, లింగారావు

ఆరుగురికి గాయాలు

మరో ప్రమాదంలో..

కొడిపల్లి మండలం నాగ్సాన్‌పల్లి హనుమాన్ ఆలయ సమీపంలో కారు, బైక్ ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిన్నారం మండలంలోని రాల్లకత్వ గ్రామానికి చెందిన దుర్గం మహేష్‌కు బైక్‌పై కొడిపల్లి వైపు నుంచి నర్సాపూర్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నాగ్సాన్‌పల్లి హనుమాన్ ఆలయం సమీపంలో 765డీ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న దుర్గం మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని ఆదే కారులో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు, బైక్ ఢీ...

శివ్వంపేట(నర్సాపూర్): కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయలైన సంఘటన మండల పరిధిలోని శభాశ్‌పల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్- నర్సాపూర్ హైవే పోతారం చౌరస్తా వద్ద ప్రమాదం చోటుచేసుకోగా బైక్‌పై ఉన్న శభాశ్‌పల్లికి చెందిన భానుప్రకాశ్‌కు గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం తూప్రాన్‌లోని ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పాముకుంట గ్రామంలో..



యాదగిరి (ఫైల్)

రాజాపేట: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని పాముకుంట గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం దౌవలపూర్ గ్రామానికి చెందిన ముక్కెర యాదగిరి (35) కుటుంబ సభ్యులతో కలిసి ఎనిమిది నెలలుగా పాముకుంట పరిధిలోని ఓ పౌల్ట్రీఫామ్‌లో పనిచేస్తున్నాడు. కాగా, ఆదివారం మధ్యాహ్నం పౌల్ట్రీఫామ్‌పై చల్లదనం కోసం గడ్డి పరుస్తున్నాడు. ఈ క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగ యాదగిరికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సమాచారం మేరకు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

4న ఎస్సీ, ఎస్టీల నియోజకవర్గ స్థాయి సమావేశం



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు

దుబ్బాకరూరల్: వచ్చే నెల 4న బీఆర్ఎస్ ఎస్సీ, ఎస్టీల నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని నియోజకవర్గ అధ్యక్షుడు ఆస యాదగిరి తెలిపారు. ఆదివారం దుబ్బాక ఎంపీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని ఎస్‌బీఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తారని తెలిపారు. ర్యాకం శ్రీరాములు, ఆస స్వామి, శ్రీనివాస్, ఎల్లం, చరణ్‌తేజ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ మృతి



వెంకటేశం (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): గాలి దుమారానికి చెట్టు కొమ్మ విరిగిపడిన ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన మృతుడు కన్నెపోయిన వెంకటేశం(30) తనకున్న సొంత లారీని అద్దెకు నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 21న ఉదయం వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీలో ధాన్యాన్ని నింపుకొని ఎనగండ్ల గ్రామ శివారులోని దుంపల కుంట రైస్ మిల్లుకు తీసుకెళ్లాడు. అన్‌లోడ్‌కు ఒకటి, రెండు రోజులు సమయం ఉండడంతో ధాన్యం లారీని అక్కడే ఉంచి ఇంటికి తిరిగి వచ్చాడు. అదేరోజు రాత్రి గాలి దుమారం లేవడం, వర్షం చినుకులు మొదలవడంతో ధాన్యం తడిసిపోతుందన్న ఆతృతలో ధాన్యం లారీపై టార్పలిన్ కప్పేందుకు బైక్‌పై అప్పాజిపల్లి నుంచి దుంపలకుంట రైస్‌మిల్లుకు బైక్‌పై వెళ్తుండగా పోతంశెట్టిపల్లి శివారులోని పాత వైన్స్ దగ్గరకు రాగానే గాలి దుమారానికి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకొమ్మ వెంకటేశంపై పడింది. దీంతో గమనించిన స్థానికులు తీవ్ర గాయాలైన వెంకటేశంను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం అమీన్‌పూర్ బృందవన్ కాలనీలో నివాసం ఉంటున్న భోజిరెడ్డి(44) కొంత కాలంగా కడుపునొప్పి, ఆస్తమాతో బాధపడుతున్నాడు. ఆదివారం తాను ఉండే ఇంటి పై అంతస్తుకు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త ఎంత సేపటికి కిందకి రాకపోవడంతో భార్య శ్వేత పైకి వెళ్లి చూడగా ఉరివేసుకొని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి వెంట మరొకరు..

కొల్చారం రోడ్డు ప్రమాదంలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య



కొడుకు కోడలు మృతదేహాల వద్ద రోదిస్తున్న రామవ్వ, బంధువులు



దుర్గాగౌడ్, లావణ్య దంపతులు (ఫైల్)

పాపన్నపేట, కొల్చారం(మెదక్): భార్య పిల్లలతో కలిసి సంతోషంగా శుభకార్యానికి వెళ్లి వస్తున్న ఆ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. దీంతో కన్న తల్లిదండ్రుల ప్రేమకు దూరమై కొడుకు, కడుపున పుట్టిన కొడుకు దూరమై తల్లి, కట్టుకున్న భర్తను కోల్పోయి భార్య అనాథలుగా మారారు..

కొల్చారంలో జరిగిన ప్రమాదంలో కూతురు అర్షిత, తమ్ముడు నాగరాజు స్పాట్‌లో చనిపోగా.. శనివారం రాత్రి దుర్గాగౌడ్, ఆదివారం ఉదయం భార్య లావణ్య తుదిశ్వాస విడిచారు. ఇలా ఒక్కొక్కరు చనిపోవడంతో ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. నిర్జీవంగా పడి ఉన్న అమ్మానాన్నలకు తలకొరివి ఎందుకు పెట్టిస్తున్నారో తెలియక చిన్నారిని అయోమయంగా చూస్తుంటే.. ఈ దృశ్యాన్ని చూసి గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు. ఆదివారం ఎల్లాపూర్‌లో జరిగిన దంపతుల అంతిమయాత్రకు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, గ్రామస్తులు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు.

తిరుగు ప్రయాణంలో..

పాపన్నపేట మండలం ఎల్లాపూర్‌కు చెందిన దుర్గాగౌడ్ భార్య, కూతురు, కొడుకు, తల్లి రామవ్వ, తమ్ముడు నాగరాజుగౌడ్‌తో కలిసి దౌల్తాబాద్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి తిరిగివస్తుండగా వీరి కారును బస్సు ఢీకొట్టింది ప్రమాదంలో కారు నడుపుతున్న నాగరాజుగౌడ్, దుర్గాగౌడ్ కుమార్తె అర్షిత అక్కడికక్కడే మరణించిన విషయం తెలిసిందే. దుర్గాగౌడ్, లావణ్యకు తీవ్ర గాయాలవగా ఆస్పత్రిలో చేర్పించారు. కుటుంబ సభ్యులు నాగరాజుగౌడ్, అర్షితల అంత్యక్రియల దుఃఖం నుంచి తేరుకోకముందే శనివారం రాత్రి చికిత్స పొందుతూ దుర్గాగౌడ్, ఆదివారం ఉదయం లావణ్య మరణించారు. తల్లి రామవ్వ, మృతుడు నాగరాజు భార్య మాధవి దుఃఖాన్ని ఆపడం ఎవరితరంకాలేదు. దుర్గాగౌడ్ నాలుగేళ్ల కొడుకు రిష్వంత్ ఒంటరివాడయ్యాడు.